

పుస్తకం.. వ్యక్తిత్వాన్ని మారుస్తుంది

(5వ పేజీ తరువాయి)

పుస్తకమే అని, మనిషిని మహనీయునిగా తీర్చిదిద్దగలిగేది పుస్తక పఠనమే అని నొక్కిచెప్పారు. పల్లెల్లో చైతన్యం తీసుకురావాలి అనే సంకల్పంతో, తాను ఇంటినే గ్రంథాలయంగా మార్చడంతో పాటు పన్నెండు గ్రంథాలయాల స్థాపనకు తోడ్పాటు అందించినట్లు తెలిపారు. రెండు లక్షల పుస్తకాలతో కొలువుదీరిన తన గ్రంథాలయానికి నిత్యం సుదూర ప్రాంతాల నుంచి పరిశోధక విద్యార్థులు వస్తుంటారని వివరించారు. వారిలో 11 మంది పీహెచ్‌డీ డాక్టరేట్లు పొందారని తెలిపారు. గద్దర్, రవ్వా శ్రీహరిలతో తనకున్న అనుబంధాన్ని కూరెళ్ల గుర్తుచేశారు. ఆచార్య రవ్వా శ్రీహరి సాహిత్య, సాంస్కృతిక వేదికను ప్రారంభించిన ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకపఠనం సంస్కృతిగా మారాలని ఆకాంక్షించారు. అనేక పుస్తకాలు ఒకచోట లభ్యం అవ్వడంతో పాటు పుస్తకాభిమానులంతా కలుసుకోడానికి ఇదొక మంచి వేదిక అని అన్నారు. కొందరు వ్యక్తిగత చొరవతో గ్రామాల్లో గ్రంథాలయాలు నెలకొల్పి, తద్వారా పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ గ్రంథాలయాల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. గ్రంథాలయాల్లో 30 ఏళ్లుగా నియామకాలు లేవని, పదేళ్లుగా పుస్తకాల కొనుగోళ్లు ఆగిపోయాయని విచారం వ్యక్తంచేశారు. కొత్త ప్రభుత్వం గ్రంథాలయాలను పటిష్ట పరచాలని కె. శ్రీనివాస్ కోరారు. సభాధ్యక్షత వహించిన బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలోనూ పుస్తక పాఠకులు తగ్గడంలేదనడానికి కోల్‌కతా బుక్ ఫెయిర్‌కు లభించిన ఆదరణ నిదర్శనం అన్నారు. గద్దర్ పేరుతో జానపద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని బుక్ ఫెయిర్ వేదికగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. గద్దర్ కుమార్తె వెన్నెల మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లే ముందు కూడా గద్దర్ పుస్తకం చదివారని తెలిపారు. ఎన్ని పనులున్నా, రోజుకు ఒక గంటైనా పుస్తక పఠనానికి కేటాయించే వారని, ఆయన్ను చూసి తమ కుటుంబ సభ్యులు పుస్తక పఠనాన్ని అలవర్చుకున్నట్లు వెన్నెల తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాస్ రెడ్డి, సుధా భాస్కర్, కవి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితం సముచితం కాదంటూ..

పుస్తక మహోత్సవాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ అమర వీరుల స్మారక స్థూపంతో పాటు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, గద్దర్ ఫౌండేషన్, నవ తెలంగాణ, తెలుగు వికీపీడియా, అక్షరయాన్ స్టాళ్లను ఆవిష్కరించారు. ఏడాదికి ఒకసారి కాదు, రెండు సార్లు పుస్తక ప్రదర్శన నిర్వహించడానికి తమ ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. బుక్ ఫెయిర్ నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రచురణలను ఆ శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మంత్రికి బహూకరిస్తుండగా, పుస్తకాలు ఉచితంగా తీసుకోవడం సముచితం కాదంటూ వెల చెల్లించారు. మరొక స్టాల్‌లోనూ అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం, గోల్కొండ చరిత్ర, గద్దర్ సాహిత్యాన్ని మంత్రి కొనుగోలు చేశారు.

బుక్‌ఫెయిర్‌లో నేటి కార్యక్రమాలు

- **మధ్యాహ్నం 2గంటలకు :** బాల వికాస్ కార్యక్రమాల ప్రారంభం
- **సాయంత్రం 5.30 గంటలకు :** పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో గులాబీల మల్లారెడ్డి రచనల ఆవిష్కరణ
- **సాయంత్రం- 6 గంటలకు :** గద్దరన్న యాదిలో
- 8 గంటలకు జానపద కళారూపాల ప్రదర్శన

బుక్ ఫెయిర్ సందర్శన వేళలు

- మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...

- లెల్లె సురేష్ దర్శకత్వంలో గద్దర్ జీవితం ఆధారంగా స్వప్నమైన నిజం నృత్య రూపకాన్ని చిందు ఆర్గనైజేషన్ కళాకారిణిలు ప్రదర్శించారు.
- భూపతి వెంకటేశ్వర్లు దర్శకత్వంలో 'మన చరిత్ర' నాటకాన్ని ముషీరాబాద్‌కు చెందిన చిన్నారులు ప్రదర్శించారు. తమదైన అభినయంతో చిన్నారులు సభికులను ఆకట్టుకున్నారు. ప్రదర్శన

పీవీకి భారతరత్న.. మురిసిన సాహితీలోకం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భారతరత్నకు ఎంపికైన పాములపర్తి వెంకట నరసింహారావుకు హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. ఉమ్మడి కరీంనగర్‌లోని వంగర గ్రామంలో పుట్టిన ఆయన వృత్తి, రాజకీయ వ్యవహారాల నేపథ్యంలో నగరంలో చాలాకాలం నివసించారు. దేశ అత్యున్నత పురస్కారం వరించిన వేళ భాగ్యనగరంలో ఆయన జ్ఞాపకాలు స్మరించుకుంటే.. తొలినాళ్లలో పీవీ నరసింహారావు ప్రముఖ న్యాయవాది బూర్గుల రామకృష్ణారావు (తర్వాత హైదరాబాద్ ముఖ్యమంత్రి) వద్ద కొంతకాలం జూనియర్‌గా ప్రాక్టీసు చేశారు. 1940-50 మధ్యకాలంలో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, భారతీయ కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాలు సుల్తాన్‌బజార్‌లో ఉండేవి. అప్పట్లో రాజకీయ సమావేశాలకు ఆ ప్రాంతమే అడ్డా. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పీవీ స్వామి రామానంద తీర్థ అనుయాయిగా తనవంతు పాత్ర పోషించారు. గురువు పేరుతో బేగంపేటలో ట్రస్టును నెలకొల్పారు. తద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నారాయణగూడలోని ప్రముఖ సాహితీ పరిశోధకుడు పల్లా దుర్గయ్య (ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎం.ఏ. తెలుగు పట్టా పొందిన తొలివ్యక్తి) ఇంటి ఆవరణం సాహితీ సమావేశాలకు కేరాఫ్. ఆ ఇంటి చుట్టుపక్క గదుల్లో ప్రముఖ సాహితీ దిగ్గజాలు బిరుదురాజు రామరాజు, దాశరథి కృష్ణమాచార్య తదితరులు అద్దెకుండేవారు. అక్కడే వారంతా కలిసి వారానికొకసారి సాహితీ సమావేశాలు నిర్వహించేవారు. ఆ చర్చలకు వట్టికోట, సినారె, కాళోజీతోపాటు పీవీ నరసింహారావు తరచుగా హాజరయ్యేవారని పలు రచనల ద్వారా తెలుస్తోంది.

భాషా నిలయంలో..

ప్రజాకవి కాళోజీతో పీవీ నరసింహారావుకు స్నేహబంధం ప్రత్యేకమైంది. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం వేదికగా ఆనాటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న పీవీ.. కాళోజీ షష్టిపూర్తి మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని నిర్వహించిన తీరే ఇరువురి మైత్రీబంధానికి ఉదాహరణ. ఆయన దేశానికి నేతైనా తన చిన్ననాటి మిత్రుడు కాళోజీ చేత మాత్రం 'ఏరా' అని పిలిపించుకోగలిగిన గొప్ప స్నేహితుడు పీవీ అని "మన భారత ప్రధాని" రచన ద్వారా అవగతమవుతోంది.

కక్షతో హత్య..

(5వ పేజీ తరువాయి)

అతడి స్నేహితుడు వినోద్‌కుమార్ వస్తుంటారు. ఆ మహిళ కుమార్తెతో వినోద్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. రామన్న కూడా ఆమెపై మనసు పడ్డాడు. ఈ విషయం వినోద్‌కు తెలిసింది. రామన్న తీరుపై వినోద్ నొచ్చుకుని విషయాన్ని మణికంఠకు చెప్పాడు. ఇదే అదునుగా ఇద్దరూ కలిసి రామన్న చంపాలనుకున్నారు. రౌడీషీటర్ కైసర్‌తో హత్యకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పథకం ప్రకారం.. మహిళ కుమార్తెతో రామన్నకు ఫోన్ చేయించి లక్ష్మీనర్సింహనగర్‌కు పిలిపించారు. అక్కడకు మణికంఠ, వినోద్ తదితరులు వచ్చి కత్తులతో రామన్నపై దాడి చేశారు. అతడి మర్మాంగాలను కోసి దారుణంగా హత్య చేశారు. స్నేహితుడైన ఫిరోజ్‌కు వినోద్ వీడియో కాల్‌లో చూపించాడు. అనంతరం కార్లలో పారిపోయారు. ఓ బార్ వద్ద పార్టీ చేసుకున్నారు. బాణాసంచా కాల్చారు. హత్య గురించి సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు తగిన ఆధారాలతో మణికంఠ, వినోద్, కైసర్, అతడి కావలి శివకుమార్, కప్పల నిఖిల్, తున్న కుమార్‌తోపాటు మహిళ, ఆమె కుమార్తెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

6 నుంచి 11 వరకు కీసర బ్రహ్మోత్సవాలు

కీసర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మార్చి 6 నుంచి 11 వరకు కీసరగుట్టలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ చెప్పారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఉత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేసి, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు.

రెండు నెలలుగా హరిజనబస్తీ నల్లాలలో..

కలుషిత నీరు

- ప్రజా పాలనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో బస్తీవాసులు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని గడ్డిఅన్నారం హరిజన బస్తీలోని ఇళ్లకు నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో కుటుంబీకులు తీవ్ర నీటి ఎద్దడికి గురవుతున్నారు. 2 నెలలుగా హరిజన బస్తీలోని ఇళ్లకు కలుషిత నీరు సరఫరా అవుతుందని బస్తీవాసులు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. బస్తీలోని దాదాపు 50 ఇళ్లకు నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో తాగునీటి కోసం పడరానిపాట్లు పడుతున్నారు. మొదట్లో కొంతవరకు వాసనతో నల్లాల ద్వారా నీరు సరఫరా జరిగేదని, తర్వాత కొద్ది రోజులకు పూర్తిగా మురుగునీరే సరఫరా అవుతుండడంతో గడచిన రెండు నెలలుగా హరిజన బస్తీలోని ప్రజలు తాగునీరు పట్టుకోవడం మానేశారు. రోజు విడిచి రోజు సరఫరా అవుతున్న తాగునీరు ఎలా వస్తుందని చూడడం, మురుగునీరు వస్తుందని గుర్తించి నల్లాలు కట్ చేయడం ఇక్కడి బస్తీవాసులకు అలవాటైపోయింది. కనీసం గంటకు పైగా వచ్చే తాగునీటిని వాడుకోలేని దుస్థితికి చేరామని బస్తీవాసులు ఆందోళన చెందుతున్నారు.



కలుషిత నీటితో నిండిన హరిజన బస్తీలోని సంపు



నల్లాల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటి శాంపిల్

జలమండలి జీఎంకు ఫిర్యాదు చేసినా..

గడ్డిఅన్నారం హరిజన బస్తీలోని కుటుంబీకులు కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జనవరి మొదటి వారంలో జరిగిన ప్రజాపాలనలో జలమండలి మలక్‌పేట డివిజన్ జీఎం ఖాదర్ మొహియుద్దీన్‌ను కలిసి ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం సమర్పించారు. అయినా ఇంతవరకు జలమండలి అధికారులు కలుషిత నీటి సరఫరా నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇళ్లలోని సంపులన్నీ కలుషిత నీటితో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. జలమండలి అధికారులు హరిజనబస్తీకి వస్తే కలుషిత నీటి సరఫరాతో తలెత్తుతున్న బాధలను చూపించేందుకు బస్తీవాసులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కలుషిత నీటి నివారణకు చర్యలు చేపడుతున్నట్లుగా చెబుతున్న జలమండలి అధికారులు ఒక్క రోజు కూడా హరిజన బస్తీకి రాలేదని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటికైనా కలుషిత నీటి నివారణకు చర్యలు తీసుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.



ఆటో కార్మికులకు మద్దతుగా ఆటోలలో ప్రయాణించి తమ నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ తదితరులు

తెలంగాణలో ఆటో కార్మికులకు మద్దతుగా శుక్రవారం ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆటోలలో ప్రయాణించి తమ నిరసన తెలిపారు. ఆటో కార్మికులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడంతో పాటు వారి కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు మాజీ మంత్రులు హరీష్‌రావు, కమలాకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతిరాథోడ్, ప్రశాంత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

\- ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి

సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు



గాంధీనగర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహననగర్, గాంధీనగర్ కాలనీలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల శుక్రవారం పర్యటించారు. గాంధీనగర్‌లో రూ.12లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి ముందు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరడంతో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు అశోక్‌కుమార్, పొటేల్ నవీన్‌యాదవ్, ప్రేంకుమార్‌యాదవ్ విన్నవించారు. తక్షణమే తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జలమండలి మేనేజర్ చంద్రునాయక్‌కు ఎమ్మెల్యే సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కారం కాగానే రూ.12లక్షలతో నిర్మిస్తున్న పనులను పూర్తిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. గాంధీనగర్ కాలనీలోని పార్క్‌ను అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరారు. పార్క్‌లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, స్ట్రీట్ లైట్స్, క్రికెట్ ఆడుకోడానికి వీలుగా నెట్ ఏర్పాటు, పచ్చదనంతో తీర్చిదిద్దాలని కోరగా అందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని ఎమ్మెల్యే బలాల జీహెచ్ఎంసీ డిప్యూటీ ఈఈ ప్రదీప్‌కుమార్‌కు సూచించారు. దాదాపు రూ.15లక్షల వరకు వ్యయమవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బొక్క మధుసూదన్‌రెడ్డితోపాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.



నిందితులతో మీడియా సమావేశంలో పోలీసులు

చైన్‌స్నాచర్ల అరెస్ట్..రిమాండ్‌కు తరలింపు

వనస్థలిపురం, ఫిబ్రవరి 9(ఆంధ్ర జ్యోతి): వనస్థలిపురంలో వ్యక్తి కళ్లలో కారంచల్లి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లిన దుండగులను పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పల్‌కి చెందిన తిరుపతి హరీష్(27), అంబర్‌పేటకు చెందిన పులిచేరు మహేష్(24), నాగోల్‌కు చెందిన మహ్మద్ మస్తాన్(23) ముగ్గురు స్నేహితులు. వీరికి అప్పుల బాధతో, అక్రమంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడాలని పథకం పన్నారు. అందులో భాగంగా ఈనెల 7న వనస్థలిపురం సాహెబ్‌నగర్ పద్మావతినగర్ బ్యాంక్ కాలనీకి చెందిన గోవర్ధన్ తన ద్విచక్ర వాహనంపై పాలప్యాకెట్లు తీసుకుని వెళ్తుండగా, అతనిని వెంబడించిన వీరు కళ్లలో కారంచల్లి, అతని మెడలో ఉన్న బంగారం గొలుసును తెంపుకుని పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా శుక్రవారం వనస్థలిపురం, పనామా చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా అనుమానాస్పదంగా వెళ్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. చైన్‌స్నాచింగ్‌కు పాల్పడింది తామే అని నిజం ఒప్పుకోవడంతో ముగ్గురినీ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద ఉన్న ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

డోర్ టూ డోర్ 'మహాలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన

- తప్పులను సరిచేస్తూ ప్రజాపాలన యాప్‌లో నమోదు
- పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో గ్యాస్ సబ్సిడీకి 3624 దరఖాస్తులు
- కమిషనర్ రవీందర్‌రెడ్డి



తట్టిఅన్నారంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి, మేనేజర్ కిరణ్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తుల్లో తప్పుల కారణంగా ప్రజలకు ఎలాంటి నష్టం జరగకూడదని ప్రభుత్వం డోర్ టూ డోర్ పరిశీలన కార్యక్రమాన్ని ప్రారంభించింది.

అందులో భాగంగా హైదరాబాద్ శివారులోని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో శుక్రవారం అధికారులు డోర్ టూ డోర్ గ్యాస్ పథకం దరఖాస్తుల పరిశీలన ప్రారంభించారు. మొత్తం మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో రూ.500 గ్యాస్ పథకానికి ప్రజల నుంచి 3624 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. అధికారులు, సిబ్బందితో కలిసి మొత్తం 34మంది దరఖాస్తుల పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు. రెండు మూడు రోజుల్లో ఈ పరిశీలన ప్రక్రియ పూర్తిఅవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కిరణ్‌కుమార్‌తోపాటు సీనియర్ అసిస్టెంట్లు హరికుమార్, అశోక్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి

- టీటీఐ ఎస్ఓపీ అమరవర్ధన్‌రెడ్డి

కొత్తపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిన్ననాటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఎస్ఓపీ అమరవర్ధన్‌రెడ్డి, తెలిపారు. హస్తినాపురం కిండిల్ కిడ్స్ స్కూల్ నుంచి శుక్రవారం 50 మంది విద్యార్థులు ఎల్‌బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్ వద్ద ఉన్న రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. ట్రాఫిక్ పార్కు ఆవరణలో ప్రహరీపై ఏర్పాటు చేసిన రంగు రంగుల ట్రాఫిక్ నిబంధనల/సూచనల పోస్టర్లలోని అంశాలను టీటీఐ అధికారులు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బడి పిల్లలందరూ ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకోవాలన్నారు. లెక్చర్ హాల్‌లో వీడియోలు, రైమ్స్ ప్రదర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులు, టీటీఐ సిబ్బందిరవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టండి

- కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి): డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో చేపట్టాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని హస్తినాపురం ఈస్ట్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఏఈ ప్రజ్ఞతో కలిసి కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి పరిశీలించారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం మహాదానం

చంపాపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆకలితో ఉన్న పేదలకు అన్నదానం చేయడం మహాదానం అని చంపాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరే రవీందర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి బచ్చు మహేశ్‌గుప్తా అన్నారు. శుక్రవారం చంపాపేట సాగర్ రోడ్‌లోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయం ఆవరణలో పేదలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 350 మందికి అన్నదానం చేశారు. అన్నదాన వితరణ కమిటీ చైర్మన్ ఇడుకుల విజయనాథ్, సంఘం సభ్యులు నర్సింహారావు, రాములుగుప్తా, జూలూరు చంద్రశేఖర్‌గుప్తా పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : కార్పొరేటర్

వనస్థలిపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్ర జ్యోతి): వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్య సాధనలో ప్రజలే ప్రచారకర్తలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. బీఎన్‌రెడ్డి నగర్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో కార్పొరేటర్ లచ్చిరెడ్డి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ రవీందర్ రెడ్డి, నాయకులు ముడుపు సందీప్ రెడ్డి, రవిశంకర్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నో ఎంట్రీ నుంచి మినహాయింపు ఇవ్వాలి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్యాకర్స్ అండ్ మూవర్స్ డీసీఎం వాహనాలకు నగరంలో నో ఎంట్రీ సమయం నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎల్‌బీనగర్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సదరు అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఎల్‌బీనగర్‌లో నిరసన తెలియజేశారు. ప్రభుత్వం చొరవ చూపి నో ఎంట్రీ నుంచి తమ ప్యాకర్స్ అండ్ మూవర్స్ డీసీఎం వాహనాలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తాండూరి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమ్మల సైదులుయాదవ్, లింగారెడ్డి, అంజయ్య, మట్టిపల్లి మల్లేష్, బత్తుల వెంకట్‌రెడ్డి, గడ్డం లింగస్వామి, నర్సింహ, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీమహంకాళీ ఆలయంలో అమవాస్య ప్రత్యేక పూజలు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అమావాస్యను పురస్కరించుకొని నాగోల్‌లోని శ్రీమహంకాళీ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బద్దం మహేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కందికంటి కన్నాగౌడ్, కోశాధికారి బద్దం నరేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు రావుల రాజుగౌడ్, చెరుకు గణేష్‌గౌడ్, బద్దం ధనుంజయగౌడ్, బద్దం వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



అయోధ్యలో బాలరాముడిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లింగాల హరిగౌడ్, మలక్‌పేట బీజేపీ నేతలు

\-సైదాబాద్, ఆంధ్రజ్యోతి


చెట్లను నరికిన బిల్డర్‌కు జరిమానా

కాలనీవాసుల ఫిర్యాదుతో ఆటవీశాఖ చర్యలు

సైదాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఫుట్‌పాత్‌పై ఉన్న భారీ వృక్షాలను నరికివేసిన బిల్డర్‌కు ఆటవీశాఖ అధికారులు జరిమానా విధించారు. మూడు భారీ వృక్షాల మొత్తం కొమ్మలను కొట్టివేసిన బిల్డర్‌కి అధికారులు రూ.63వేల జరిమానా విధించి చేతులు దులుపుకున్నారు. సైదాబాద్ కాలనీ నుంచి దోబీఘాట్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై కొత్తగా బిల్డర్ అపార్ట్‌మెంట్ నిర్మాణం చేస్తున్నాడు. అడ్డుగా ఉందన్న కారణంతో ఫుట్‌పాత్‌పై ఉన్న మూడు భారీ వృక్షాలను కొట్టివేశారు. దీంతో స్థానికులు ఆటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి వ్యాపారికి రూ.63వేల జరిమానా విధించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రేష్ఠ శ్రీకమల ఆస్పత్రిలో డెంటల్, కాస్మోటాలజీ, ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఈనెల 11వ తేదీ ఆదివారం ఉదయం ఉచిత వైద్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఎముకల సాంద్రత, ఫిజియోథెరపీ, దంత పరీక్షలు అందుకు అవసరమైన ఎక్స్‌రేలను శిబిరంలో ఉచితంగా చేయనున్నారు. ఉదయం 10గంటల వరకు సాయంత్రం 4గంటల వరకు శిబిరంలో ఉచిత వైద్యసేవలను అందించనున్నారు. ఇతర వివరాల కోసం 8908901188 ద్వారా సంప్రదించవచ్చు.



చంపాపేటలోని ఆర్యవైశ్యసంఘం కార్యాలయం ఆవరణలో అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

కాంగ్రెస్ వైపు బీఆర్ఎస్ కార్పొరేటర్ల చూపు!

- బడంగ్‌పేట్, మీర్‌పేట్ నుంచి పది మందికి పైగా..
- త్వరలో హస్తం గూటికి చేరే చాన్స్..?
- మీర్‌పేట్‌లో బీజేపీ సభ్యులు సైతం..!

సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు హస్తం పార్టీ వైపు చూస్తున్నారు. దాదాపు పది మందికి పైగా ఆ పార్టీ కార్పొరేటర్లు కారుకు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. దీనిపై ఇప్పటికే కాంగ్రెస్‌లోని పలువురు పెద్దలను కలిసి మంతనాలు సాగించినట్లు సమాచారం!

ఎంపీ ఎన్నికలకు ముందే క్యూ

వాస్తవానికి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచే బీఆర్ఎస్ నేతలు, ప్రజా ప్రతినిధులు ఆ పార్టీ వైపు మొగ్గు చూపుతున్న సంగతి విదితమే. అయితే వెంటనే పార్టీ మారితే తప్పుడు సంకేతాలు వెళ్తాయనే ఉద్దేశ్యంతో ఓపిక పట్టారు.

ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడు పార్టీ మారితే ఎలాంటి అపవాదు రాదనే అభిప్రాయాన్ని బీఆర్ఎస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ ఎన్నికల తర్వాత వచ్చే ఫలితాలను బట్టి పార్టీ మార్పుపై నిర్ణయం తీసుకోవాలని కూడా ముందుగా భావించారు. అయితే సదరు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అనుకూల పవనాలు లేవనే సంకేతాలు రావడం, పలు సంస్థల సర్వేల్లోనూ కాంగ్రెస్‌కు మెజారిటీ సీట్లు దక్కుతాయని స్పష్టం కావడంతో ఇక పార్టీ మారక తప్పదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరాలని యోచిస్తున్నట్లు తెలియవచ్చింది.

బీజేపీ సభ్యులు సైతం..?

బడంగ్‌పేట్‌లోని పది మంది బీజేపీ సభ్యులు అదే పార్టీలో కొనసాగే సూచనలు కనిపిస్తుండగా.. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పలువురు బీజేపీ కార్పొరేటర్లు మాత్రం పార్టీని వీడాలని యోచిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. తాము మీర్‌పేట్ మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టాలని భావిస్తే తమ పార్టీకి చెందిన సభ్యులు కొందరు బీఆర్ఎస్ నేతలతో అంటకాగి తమకు మద్ధతు ఇవ్వడానికి విముఖత వ్యక్తం చేసినందున.. ఇక తాము పార్టీలో కొనసాగి ప్రయోజనం లేదని భావించిన సదరు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరాలని భావిస్తున్నట్లు తెలిసింది.

పార్టీ మార్పు అనంతరం సభ్యుల బలాబలాలను బట్టి అటు బడంగ్‌పేట్‌లో, ఇటు మీర్‌పేట్‌లో మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాసం పెట్టే అంశంపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక ఏం జరుగుతుందన్నది వేచి చూడాల్సిందే.